క్లుప్తంగా

16న సర్వసభ్య సమావేశం

రాపూరు: రాపూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ ప్రసన్న అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొనాలని ప్రకటనలో కోరారు.

ఏకొల్లులో శతజయంతి వేడుకలు



ప్రార్థనల్లో సంఘ సభ్యులు

దొరవారిసత్రం: ఏకొల్లు గ్రామపరిధిలో ఎస్‌పీలేసీ చర్చి నిర్మించి నూరేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా సంఘ సభ్యులు శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏకొల్లు ప్యారిస్ పరిధిలోని డీవీ సత్రం, నెలబల్లి, కుప్పారెడ్డిపాళెం, రామారెడ్డికండ్రిగ ప్రాంతాల్లోని చర్చి సంఘ సభ్యులు శతజయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఏకొల్లు చర్చి ప్రత్యేకతను పలువురు వ్యక్తులు తెలియజేశారు. 1923లో ఈ చర్చిని నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో స్థానిక పాస్టర్ నిర్మల్‌కుమార్ ప్రసంగించారు.

కండలేరులో 13.385 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 13.385 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 845 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 25, లోలెవల్ స్లూయిజ్‌కు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం

వాకాడు(చిట్టమూరు): మండల కేంద్రం జీఎంఎస్ జిల్లా ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థులు దాతృత్వంతో ఆదివారం పాఠశాల ముఖద్వారం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు రూ.2లక్షలతో ముఖద్వారం నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు.

దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉంది

తిరుపతి కల్చరల్: మతోన్మాదం పేరుతో దేశాన్ని విభజించాలని ప్రయత్నిస్తున్న వారి నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి విద్యార్థులు, యువతపై ఉందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ తెలిపారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక తరగతులు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఆయన మాట్లాడుతూ నేడు ఢిల్లీలో జరుగుతున్న జీ–20 దేశాల సదస్సు, అంతకుముందు జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సు, జీ–7 దేశాల సదస్సుల్లో ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం కోసం జరిగినవేనన్నారు. ఆయా దేశాల్లో పేద, బడుగు, బలహీనవర్గాలు, విద్యార్థి, నిరుద్యోగులు, రైతులు, కార్మికుల గురించి ఆలోచించడం లేదన్నారు. భారతదేశం నేడు ధనిక, పేద అనే రెండు భాగాలుగా విడిపోయిందన్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, అధ్యక్షుడు భూషణం మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక తరగతులు ఆశించిన దానికన్నా ఎక్కువగా విజయవంతం అయ్యాయని తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుచానూరుకు చెందిన శివనాట్య కళా నిలయం, నాట్య గురువు సంధ్య ఆధ్వర్యంలో కళాకారులు యువదర్శిని, మహాలక్ష్మి, తన, మోక్ష, నిఖిత, స్ఫూర్తి, చాందిని, చార్వి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వారిని ఏవో ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు.

వేడుకగా కుంభాభిషేకం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని యోగిమల్లవరంలో వెలసిన కామాక్షి సమేత పరాశరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వేడుకగా కామాక్షి అమ్మ ఉత్సవర్లకు మహా కుంభాభిషేకం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, రెండో కాలయాగ సాల పూజ నిర్వహించారు. తదుపరి అమ్మవారికి పట్వార్చన, ప్రాణ ప్రతిష్ట నామకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రదక్షిణంగా తీసుకొని వచ్చి స్నపన తిరుమంజనం చేశారు. కార్యక్రమాన్ని ఈవో మమత పర్యవేక్షించారు.

శరవేగంగా భవన నిర్మాణాలు

సూళ్లూరుపేట రూరల్: ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, నాడు నేడు కింద అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. సూళ్లూరుపేట మండలంలోని రెండో విడత మనబడి నాడు నేడు కింద రూ.54 లక్షలతో పెద్దపడవ, చెరువుమిట్ట, తేవల్ తేరికట్ట గ్రామాలు, పట్టణంలోని సూళ్లూరు దళిత వాడలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అన్నిచోట్ల బేస్‌మెంట్ లెవల్ పనులు పూర్తిచేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికార సమక్షంలో పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే సగం పనులు పూర్తిచేశారు. ఒక్కొక్క అంగన్‌వాడీ భవనానికి రూ.13.50 లక్షలు కేటాయించినట్లు సీడీపీఓ శారదాంబ తెలిపారు. అదేవిధంగా పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి విప్లవాత్మకమైన మార్పును తీసుకొచ్చారు. మండల పరిధిలోని ఎనిమిది సచివాలయాలకుగాను రూ.1.40 కోట్ల నిధులు మంజూరు చేసి ఎనిమిది వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు జగురుగుతున్నాయి. ఈ పనులు పంచాయతీరాజ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో సాగుతున్నాయి. ఒక్కొక్క హెల్త్ క్లినిక్‌లకు రూ.17.50 లక్షలతో భవనాలు పూర్తి చేసిన ప్రాంతాల్లో అదనంగా మరో రూ.3.30 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికే మండల పరిధిలోని దామానెల్లూరులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం పూర్తి చేశారు. కడపత్ర గ్రామంలో భవనం శ్లాబ్ నిర్మాణం పూర్తయింది. పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.



కడపత్రలో శ్లాబ్ పనులు పూర్తయిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం



సూళ్లూరులో బేస్‌మెంట్‌లో అంగన్‌వాడీ కేంద్రం



లక్ష్మీనాయుడుకండ్రిగలో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

రూ2.60 కోట్లతో సీసీ రోడ్లు

పెళ్లకూరు: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలోని పలు గ్రామాల్లో రూ2.60కోట్ల నిధులతో సిమెంట్ రోడ్లు పనులు చేపడుతున్నట్లు ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం లక్ష్మీనాయుడుకండ్రిగ గ్రామంలో రూ.5లక్షల నిధులతో సీసీరోడ్డు పనులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చిల్లకూరులో, జీలపాటూరులో, పెన్నేపల్లిల్లో, పుల్లూరులో, రోసనూరులో, కానూరులో, పెళ్లకూరులో, కొత్తూరులో, రావులపాడులో మొత్తం రూ2.60కోట్లతో సిమెంట్ రోడ్డు పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈక్రమంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కొబ్బరికాయలు కొట్టి లక్ష్మీనాయుడుకండ్రిగలో సిమెంట్‌రోడ్డు పనులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నేత పరంధామనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వేమా పాఠశాలలో ఆదివారం కోగిలి జయరామిరెడ్డి సేవా సంస్థ సహకారంతో నాయుడుపేట రోటరీ క్లబ్ నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి ఎస్వీ అరవింద్ కంటి వైద్యశాలకు చెందిన డాక్టర్ గౌరిశంకర్ సారథ్యంలో జరిగిన శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు చేసుకున్నారు. వీరిలో 25 మందికి ఉచితంగా శస్త్ర చికిత్స చేసేందుకు ఎంపిక చేశారు.

108లో ప్రసవం



పుట్టిన బిడ్డతో 108 సిబ్బంది

సైదాపురం: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ 108లో సుఖప్రసవం చేసుకుంది. ఈ సంఘటన వేములచేడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వేములచేడు గ్రామానికి చెందిన సునీత నిండు గర్భిణి. ఆమెకు ఆదివారం పురిటి నొప్పులు తీవ్రం కావడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందజేశారు. దీంతో స్థానిక 108 వాహనం సిబ్బంది సకాలంలో గ్రామానికి చేరుకుని సునీతకు వైద్యసేవలను ఈఎంటీ ఎం అశోక్‌కుమార్ అందజేశారు. వాహనంలోనే సకాలంలో వైద్యపరీక్షలు చేయడంతో సునీత ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో ఆమె కుటుంబసభ్యులు 108 వాహన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



సత్కారం అందుకున్న టీచర్లతో సంస్థ ప్రతినిధులు

గురువులకు ఘన సన్మానం

గూడూరురూరల్: ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా ఆదివారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో గూడూరులోని శ్రీచైతన్య స్కూల్ ఆడిటోరియంలో ఎనిమిది మంది ఉత్తమ గురువులను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన టి.నర్సారెడ్డి, పి.కృష్ణకిషోర్, ఎస్.కె.మహ్మద్ రఫీ, ఎస్.కె.రహమతున్నీసా, ఎస్.చంద్రశేఖర్‌బాబు, వి.కామేశ్వరి, ఆర్.లీల, టి.విజయలను గజమాలలతో సతీ సమేతంగా శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. ఆంధ్రమహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ స్నేహలతారెడ్డి, ప్రెసిడెంట్ విష్ణువందన, సెక్రటరీ శశిరేఖ, ఆంధ్రమహిళా మండలి అధ్యక్షురాలు జమున, ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వాకాటి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



నూతనంగా ప్రతిష్టించిన విగ్రహాలు

సైదాపురం: మండలంలోని దాడిశెట్టిపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీపాండురంగస్వామి దేవస్థానంలో శ్రీపాండురంగస్వామి, రుక్మిణి అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవాలను ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. వేదపండితుల నడుమ అత్యంత వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలు నడుమ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఇస్రో రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



శ్రీనివాసులును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

సూళ్లూరుపేట: ఇస్రోలో అంతర్భాగమైన సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్‌లో వివిధ హోదాల్లో పనిచేసి ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన లవిశెట్టి శ్రీనివాసులుకు సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వపు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎల్ శ్రీనివాసులు స్థానికుడిగా ఇక్కడే చదివి ఇస్రోలో ఉద్యోగం సంపాదించి వివిధ రకాల హోదాల్లో పనిచేసి ఈ స్కూల్‌కు, కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారని, అలాగే పూర్వపు విద్యార్థుల సంఘంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఉన్నారని సంఘం తెలిపింది. ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన్ను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోనే ఘనంగా సత్కరించి మెమెంటోలను అందజేశారు. పూర్వపు విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఆర్‌ఐఓ ఆదూరి శ్రీనివాసులు, స్కూల్ హెచ్‌ఎం కాపులూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వపు విద్యార్థుల సంఘం ప్రతినిధులు అనిల్‌రెడ్డి, ఉమ, భాస్కర్, సురేష్, ఆదినారాయణరెడ్డి, ఎన్ఎస్ కుమార్, గురు, డాక్టర్ సాయిరామ్, ధనంజయరెడ్డి, రాజేంద్ర, ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

నోటీసులు ఇచ్చినా నాన్చుడే..

- రెవెన్యూ అధికారుల నాన్చుడి ధోరణి

చిల్లకూరు: మండలంలోని బూదనం టోల్‌ప్లాజాకు కొంతదూరంలో జాతీయ రహదారి పక్కనే నిర్వహిస్తున్న టైల్స్, సిలికా వ్యాపారం చేసే భూములు పేదలకు పంపిణీ చేయగా వ్యాపారస్తులు నామమాత్రం లీజులతో భూమి కన్వర్షన్ కాకుండానే వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని రెండు నెలల క్రితం సాక్షిలో పేదల భూముల్లో పెద్దల వ్యాపారం అనే కథనం ప్రచురితం కాగా అప్పట్లో నోటీసులు ఇచ్చిన రెవెన్యూ అధికారులు తరువాత పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో వ్యాపారాలు కొనసాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. బూదనం టోల్ ప్లాజాకు కూతవేటు దూరంలో ఉన్న సర్వే నంబర్ 209–6లో 48 సెంట్లు, 210–3లో 1.53 సెంట్లలో కొంత భూమిని గ్రామానికి చెందిన కొంతమంది పేదలకు గత కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం పంపిణీ చేసింది. అప్పట్లో లబ్ధిదారులు భూములను సాగు చేసుకుంటూ ఉండే వారు అయితే ఇటీవల భూములకు విపరీతమైన గిరాకీ ఏర్పడడంతో వ్యాపారస్తుల కన్నుపడింది. అంతే లబ్ధిదారుల నుంచి నామమాత్రం లీజుకు భూముల తీసుకుని సిలికా, టైల్స్ వ్యాపారం చేపట్టారు. వ్యవసాయం చేసే భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేసేందుకు ముందస్తుగా అనుమతులు తీసుకుని వ్యాపార కార్యకలాపాలు చేపట్టాలి. ఇలా వ్యవసాయేతర భూమిగా మార్పు చేసుకున్న సందర్భంగా ప్రభుత్వానికి కొంత ఆదాయం వస్తుంది. అయితే వ్యాపారులు ప్రభుత్వం ఆదాయానికి గండి కొడుతూ వాణిజ్య పన్నుల అధికారుల కళ్లు గప్పి బిల్లులు లేకుండా వ్యాపారాలు చేస్తుండడంతో లక్షల ఆదాయం ప్రభుత్వం కోల్పోతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం వ్యాపారస్తులు అందించే ముడుపులు అందుకుని తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపస్తున్నాయి. ఇకనైనా ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చేలా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.



పేదల భూముల్లో కొనసాగిస్తున్న టైల్స్ వ్యాపారం

న్యాయమే గెలిచింది

సూళ్లూరుపే రూరల్/చిల్లకూరు: 'చట్టం తన పని తాను చేసుకుపోతుంది..ఇందులో మా ప్రమేయం ఏమీ లేదు..మేం ఎవరినీ మేనేజ్ చేయడం లేదు..' ఇది గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు అప్పటి సీఎం నారా చంద్రబాబునాయుడు అన్న మాటలివి. ఇప్పుడు అదే చట్టం తన పని తాను ఆయన విషయంలో చేసేసరికి ఆయన, ఆ పార్టీ శ్రేణులు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జీర్ణించుకోలేకపోతున్నారు.. చంద్రబాబు అరెస్ట్, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు విధించడం హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే అంశం చర్చనీయాంశమైంది.

రిమాండ్ సమంజసమే..



తప్పు ఎవరిదైనా తప్పే, ఈ రోజు న్యాయం గెలిచింది. చంద్రబాబు అవనీతికి పాల్పడిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కోర్టు 14 రోజులు ఇచ్చిన రిమాండ్ సమంజసమే. తప్పు చేయకుంటే ఎందుకు రిమాండ్ విధిస్తుంది. జగనన్న ప్రభుత్వం ఎప్పుడూ పేదల వైపే ఉంటూ ధర్మ పాలన చేస్తుంది. తమ పార్టీలో వ్యక్తులు తప్పు చేసినా జగనన్న ధర్మపాలనే చేస్తారు. –అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ

చట్టం ఎవరికీ చుట్టం కాదు



తప్పులు చేసిన వారికి చట్టం ఎప్పుడూ చుట్టంకాదు. స్కిల్ డెవలప్‌మెంటు కేసులో ఏసీబీ కోర్టు చంద్రబాబుకు విధించిన రిమాండ్ సమంజసమే. భారత రాజ్యాంగం ప్రకారం తప్పులు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష ఖాయం. 14 ఏళ్ల సీఎంగా చేసిన చంద్రబాబు తప్పు చేసినట్లు కోర్టు గుర్తించినందునే రిమాండ్ విధించింది. –మన్నెం శీనయ్య జెడ్పీటీసీ, చిల్లకూరు

కోర్టు తీర్పు హర్షణీయం



స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ఏసీబీ కోర్టు చంద్రబాబుపై ఇచ్చిన తీర్పు హర్షణీయం తప్పు చేసినట్లు సాక్ష్యాలు ఉండడంతోనే కోర్టు రిమాండ్ విధించింది. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తప్పులుచేస్తే అడిగే వారు ఉండరనుకోవడం సరైంది కాదు. కాలం తీర్పు ఇచ్చిన రోజున కోర్టు ముందు తలవంచాల్సిందే. అదే నేడు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు జరిగింది.

–అన్నంరెడ్డి పరంధామరెడ్డి, మండల కన్వీనర్, చిల్లకూరు

బీమా నగదు పంపిణీ

నాయుడుపేటటౌన్: తుమ్మూరు సచివాలయ పరిధిలో మంగపతినాయుడునగర్‌కు చెందిన మృతి చెందిన నల్లమేకల ఆనంద్ (43) కుటుంబసభ్యులకు ఆదివారం వైఎస్సార్ బీమా నగదును అక్కడి వార్డు కౌన్సిలర్ దారారవి అందజేశారు. ఆనంద్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీంతో ఆదివారం తుమ్మూరు సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి శ్రీనివాసులు బీమా నగదు రూ.లక్షలో ముందుగా రూ.10 వేల నగదును మృతుని భార్య నల్లమేకల అమలకు కౌన్సిలర్‌చే అందించారు. వలంటీర్ అరవ కుముద, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



బీమా నగదు అందిస్తున్న కౌన్సిలర్ దారారవి

15, 16 తేదీల్లో క్రీడాపోటీలు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మండల స్థాయి పాఠశాలల ఏజీఎఫ్ క్రీడా పోటీలను ఈనెల 15, 16 తేదీల్లో కోటపోలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్నామని ఎంఈఓలు కాపులూరు శ్రీనివాసులు, ఎస్ శ్రీనయ్య, కోట పోలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం మెల్లకంటి చంద్రజిత్ యాదవ్ తెలిపారు. తొమ్మిది రకాల క్రీడాంశాల్లో అండర్–14, అండర్–17 బాల బాలికలకు ఎంపికల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చునని మండల ఎస్‌జీఎఫ్ సమన్వయకర్త సన్నాయి భాస్కర్ తెలిపారు. ఈనెల 15న బాలికలకు, 16న బాలురకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో పేర్లు తప్పక రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 9347038584 నంబర్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతిని ఆకాంక్షించిన సీఎం ..

చిల్లకూరు (చిట్టమూరు): రాష్ట్రంలో బీసీలకు చోటు కల్పిస్తున్నామని చెప్పిన చంద్రబాబు ముదిరాజ్‌ల పట్ల చిన్నచూపు చూపితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముదిరాజ్‌ల అభ్యున్నతిని ఆకాంక్షించారని ముదిరాజ్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కొర్నా నారాయణ అన్నారు. గూడూరు నియోజకవర్గంలోని కోట మండలం కేశవరం, చిట్టమూరు మండలం పిట్టివానిపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన పలువురు ముదిరాజ్ నాయకులను కలుసుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ఆయా గ్రామాల్లోని ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడైనా ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరితే అందుకు అంగీకరించి త్వరలో కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని అన్నారు. అనంతరం ఆయన్ను స్థానిక ముదిరాజ్‌లు సత్కరించారు. నేతలు సతీష్, సుధీర్, రమేష్ ఉన్నారు.



చైర్మన్‌ను సత్కరిస్తున్న పిట్టివానిపల్లి ముదిరాజ్‌లు

ఘనంగా లక్ష తులసీదళాల పూజలు





ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు, లక్ష తులసీ దళాలతో హోమం నిర్వహిస్తున్న పండితులు

సూళ్లూరుపేట: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీసీతారాముల ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామివారికి లక్ష తులసీదళాలతో హోమం నిర్వహించారు. ముందుగా మూలవిరాట్ సీతారాములు, లక్ష్మణ విగ్రహాలకు విశేష అభిషేకాలు, ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేసి స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. గణపతిపూజలు చేసి హోమాలు నిర్వహించారు భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి హోమ పూజల్లో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకున్నారు.

తరలిపోతున్న వృక్ష సంపద

- ఓల్టా చట్టం హుళుక్కే

చిల్లకూరు: భూమిలో నీరు తోడుకోవాలన్నా, చెట్టు నరికి వేయాలన్నా అధికారులు పరిశీలించి ఓల్టా చట్టాన్ని అతిక్రమించకుడా ఉంటే అనుమతులు మంజూరు చేసిన తరువాత పనులు చేపట్టాలి. అయితే కొంతమంది అక్రమంగా చెట్లు ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా నరికివేస్తున్నారు. దీంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఒక వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కలు పెంపకంపై అవగాహన కల్పిస్తూ ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తుండాలని ఆదేశాలు జారీ చేస్తుంది. అయితే వ్యాపారం చేసే వారు తమకు ఆ నిబంధనలు వర్తించవని తమ ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ చెట్లు నరికి తరలించేస్తున్నారు. ఇలా తరలించే సమయంలో అటవీశాఖాధికారుల దృష్టికి తీసుకెళితే అటవీ సంపద కాదు అని మిన్నకుండిపోతున్నారు. గ్రామాల్లో ఉండే వీఆర్‌ఓలు చెట్ల నరికివేతపై కనీసం దృష్టి సారిస్తే కొంతైనా ఓల్టా చట్టాన్ని అమలు చేసిన వారవుతారు. అటు వైపుగా రెవెన్యూ అధికారులు దృష్టి సారించి చెట్లను నరికి వేయకుండా చర్యలు చేపట్టాలని పర్యావరణ పరిరక్షకులు కోరుతున్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న వృక్ష సంపద

కళల వికాసంతోనే సమాజ శ్రేయస్సు

తిరుపతి కల్చరల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం పట్టే కళల వికాసంతోనే సమాజ శ్రేయస్సు ముడిపడి ఉంటుందని పలువురు వక్తలు తెలిపారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో చేపడుతున్న జాతీయ సంగీత, సాహిత్య, నృత్యోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం రాత్రి నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం హాజరై ప్రసంగించారు. అనంతరం కళాపోషకులు, సమాజ సేవలకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. శాంతిమోహన్‌కు నాట్య విద్వన్మణి, ఎన్‌టీ.హర్షవర్ధన్‌రెడ్డికి విశిష్ట సేవా పురస్కారం, కళాకారుడు మునస్వామికి సేవారత్న పురస్కారం ఎన్.భవితశ్రీకి నాట్యతరంగిణి, వరంగల్‌కు చెందిన కె.అనన్య, హనుమకొండకు చెందిన చందన, అనపర్తికి చెందిన హిరణ్యారెడ్డికి నాట్యరంజిత పురస్కారాలు అందజేశారు.



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు